# అఖిలం - మధురం

- *నిర్మలాదిత్య*

'మధురాధిపతే అఖిలం మధురం' అంటూ ఎమ్ఎస్ గొంతులో నా ఫోన్ మ్రోగగానే వులిక్కిపడ్డాను.

ఆ రింగ్ టోన్ నన్ను పేజి చేయటానికని పెట్టాను. అమ్మ, నాన్నలను పేజ్ చేస్తే అర్థముంది. నాన్న కార్డియాలజిస్టు, అమ్మ ఓబిజివైఎన్. చిన్నప్పటినుంచి వారి పేజర్లు మ్రోగడం, వారు ఆఘమేఘాలలో వున్నట్టుండి మాయమవ్వడం నాకు పరిచితమే. ఈ పేజర్ల చప్పుళ్ళలో సృష్టించబడిన పూర్తికాని సంభాషణలు, ఆగిపోయిన పుట్టినరోజు పార్టీలు, గెలుపు ఓటములు తేల్చుకోలేని ఆటలు, ఒంటరి భోజనాలు నాకు మదిలో మిగిలిన చేదు గురులే. ఫోన్ తీసి నంబరు చూసి ఫోన్ చేసాను.




"దిసీజ్ క్రిష్, నన్ను పిలిచావా?"

"హై క్రిష్, గ్లాడ్ యూ రిటర్న్‌డ్ ద కాల్. మిస్టర్ రాండెల్ మా హాస్పిటల్లో వున్నారు. నిన్ను చూడాలని అడిగారు."

బాబ్ రాండెల్ ఓ సంవత్సరమైంది చూసి. నేను మెడికల్ కాలేజీ చేరకముందు తరచుగానే కలిసేవాణ్ణి. కానీ ఓ మూడు సంవత్సరాల క్రితం ఇంట్లో పెద్ద గొడవైంది. అండర్ గ్రాడ్ లో మేజర్ ఇంకా ఎన్నుకోనందుకు. కెరీర్ ఇంకా నిర్ణయించుకోలేదని అమ్మ నాన్నలకు కోపం. అప్పట్లో రోజూ యింట్లో ఓ గొడవే. గ్రేడ్స్, SAT స్కోర్ లతో మాత్రమే మెడికల్ సీట్ రాదని బలవంతంగా నన్నూ ఓ వాలంటీర్ ప్రోగ్రాం లో చేరమని పోరు. ఇక ఇంట్లో వుండలేక అమెరికన్ కేన్సర్ సొసైటీలో వాలంటీర్ గా చేరాను. వాళ్ళు పేజ్/ఫోన్ చేసినప్పుడల్లా కారు తీసుకొని పేషెంట్ వున్న అపార్ట్‌మెంటుకు వెళ్ళడం. అక్కడినుంచి వారిని తీసుకొని హాస్పిటల్‌కు వెళ్ళడం. వాళ్ళ కీమో, రేడియేషన్ ట్రీట్‌మెంట్ అయ్యాక వారిని తిరిగి పికప్ చేసుకొని వాళ్ళింటి దగ్గర దిగపెట్టడం. మొదట బలవంతంగానే ఈ పని మొదలుపెట్టినా, నాకు ఈ పని మీద ఆసక్తి పెరిగింది. రాబర్ట్ రాండెల్‌ని కలిసిన మొదటిసారి "బాబ్" అని పిలవమని నవ్వుతూ చెప్పాడు. ఎందుకో ఎమ్ఎస్ "హసితం మధురం" అని మధురాష్టకం పాడాలనిపిస్తుంది బాబ్ నవ్వు చూస్తే. అతనింటినుంచి హాస్పిటల్ ఓ గంట ప్రయాణం. అలా బాబ్‌ను తీసుకొని పనిపడినప్పుడల్లా రెండుగంటలు ఆయనతో మాట్లాడ గలిగే అవకాశము దొరికేది. నాకిద్దరు తాతలు ఇండియాలో వున్నారు కాని బాబ్‌కు కూడా ఆ వయస్సే వుండచ్చు. దాదాపు తొంభై ఏళ్ళు వుంటాయనుకుంటా. మొదటిసారి చూసినప్పుడు బాగా నెరిసిపోయినా తలపైన జుట్టు వత్తుగానే ఏ మాత్రం బట్టతల ఛాయలు లేకుండా వుండేవి. కీమో మొదలెట్టాక అతను పూర్తిగా వెంట్రుకలు పోగొట్టుకోవడం, బాగ వీక్ కావడం నా కళ్ళ ఎదుటే చూడటం జరిగింది. నేను వాలంటీరుగ పనిచేసిన రెండేళ్ళు చాలామంది పేషంట్లను చూసినా బాబ్ లాంటి అతను తటస్థపడలేదు. ఎలాంటివారినైనా సేదతీర్చేలాంటి అతని నవ్వు నేను మరెక్కడా చూడలేదు. అలాగే అతన్ని చూసి అతనితో మాట్లాడుతూ వుంటే మన సుఖ దుఃఖాలను పంచుకోవాలనిపించడం నాకు కొత్త అనుభవమే. డాక్టర్ అవ్వాలా లేదా అన్న మీమాంస, ఇంట్లో ఆ విషయం పైన గొడవ పడటం కూడా అంతా శాంతంగా విని మెడికల్ ప్రొఫెషన్ గొప్పతనం గురించి తల్లితండ్రులు పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడం తప్పుకాదని మెల్లగా నా మనస్సు మెడికల్ వైపు మళ్ళడానికి దోహదపడ్డాడు.

సెల్ ఫోన్ తో బాటు పక్కనే వున్న ఐ పాడ్ కూడా తీసుకున్నాను. పైజామా నుంచి జీన్స్ లోకి మారి క్రింద ఫ్లోర్‌కు వెళ్ళాను. డ్రాయింగ్ రూములో అమ్మ ఏదో టీవీ ప్రొగ్రాం చూస్తున్నది. పక్కనే తన పేజర్ కూడా వుంది. నాన్న అప్పటికే ఏదో 'కాల్' వస్తే వెళ్ళి పోయినట్టున్నారు.

"అమ్మా కేన్సర్ సొసైటీ వాళ్ళు పిలిచారు వెళ్తున్నాను."

'మెడికల్ కాలేజి చేరిన తర్వాత నీకసలు తీరికే

లేదు కదరా" అంది అమ్మ.

"బాబ్ గురించి చెప్పాను కద. చూడాలని కబురంపాడు. వెళ్ళి చూసి వస్తాను."

కారులో ఐపాడ్ కనెక్ట్ చేసి వెంటనే ఎమ్ఎస్ సుబ్బలక్ష్మి పాడిన 'మధురాష్టకం' వెదికి ప్లే నొక్కాను. కారు రేడియో నుంచి ఎమ్ఎస్ శ్రావ్యంగా పాడటం మొదలు పెట్టింది. డాక్టర్ ??? చిన్న పిల్లలకు వ్రాసినట్టు మితమైన పదాలు ఎన్నుకుని ఇంత ఉదాత్తమైన భావాన్ని "మధురాష్టకం"లో వల్లభాచార్యులు 15వ శతాబ్దంలోనే ఎలా వ్రాయగలిగాడు. గూగుల్‌లో వెదికా. అతడు ఓ ప్రవాసాంధ్రుడే. తెలుగు మాతృభాషగా వున్నవాడే. తెలుగులోని తియ్యదనాన్ని సంస్కృతంలో పొందు పరచినట్లు వుంది ఈ మధురాష్టకం. చలికాలం బయట 'స్నో' వల్ల భూమి అంతా తెల్లగా వుంది. ఆకులు రాల్చిన చెట్లు మంచును పులుముకొని కొత్త అందాలు సంతరించుకొన్నట్లు వున్నాయి. ఆకాశంలో ఒక్క మేఘం లేదు. మూడొంతులు నిండుగా వున్న చంద్రుడు వెచ్చగా వెన్నెల కాస్తున్నాడు. అంత నిశ్శబ్దంగా నిస్తబ్ధంగా వున్న లోకంలో నాకెదురుగా రోడ్డుకడ్డంగా జింకలు పరుగెత్తి అటువైపు చెట్ల గుంపుల పైకి పోయాయి. "-------- చలితం మధురం అని అప్పుడే వినడం ఆ క్షణ అందాన్ని మరింత ద్విగుణీకరించినట్లు అనిపించింది.

హాస్పిటల్ రావడంతో కారు ఆపి బాబ్ వున్న యూనిట్ వైపు నడిచాను. నర్సింగ్ స్టేషన్‌లో వున్న ఆవిడకు నన్ను పరిచయం చేసుకోగానే బాబ్ రూముకు తీసికెళ్ళింది. బాబ్ పడుకునే వున్నాడు. 'కీమో' ఆపేశాక మళ్ళీ జుట్టు పెరిగినట్లుంది. తలంతా ముగ్గుబుట్టలాగ వుంది. ఆక్సిజన్ మాస్క్ ముఖమీద పెట్టారు.

'బాబ్!' అని పిలిచాను. వులుకు పలుకు లేదు. నర్స్, బాబ్ చివరిదశలో వున్నాడని నన్నుచూడాలని చెప్పాడని చెప్పి సెలవ తీసుకొంది. మంచం పక్కన అటువైపు గోడకు పెద్ద కిటికీ వుంది. ఆ కిటికి అద్దం లోనుంచి బయట వింటర్ సీనరి ఏదో క్యాలెండర్ పిక్చర్ లా అనిపిస్తున్నది. మనస్సులో మళ్ళీ ఎమ్ఎస్ పాడినట్లు అనిపించింది.

"-----సఖ్యం మధురం ----" బాబ్‌తో కలవడం ఓ మధురమైన అనుభవమేకద అనిపించింది. అంతా నెగటివ్ మైండ్‌తో వున్న నన్ను దగ్గర తీసి నవ్వుతూ జోకులు చెప్తూ దగ్గరలేని తాతలుగా బుజ్జగించి జీవిత పాఠాలను అరటిపండులా ఒలిచి తినిపించాడనిపించింది. కాని నేను తనకు థాంక్స్ చెప్పినప్పుడల్లా తను నాకంటే ఋణపడి వున్నానని పెద్దగా నవ్వేవాడు.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్ వచ్చిన తరువాత ఆ విషయం మొదట నేను చెప్పడం బాబ్ కే. బాబ్ సంతోషం పట్టలేము. కంగ్రాట్స్ చెప్పి తన ఒంటరితనం గురించి మాట్లాడాడు. అతనికి పిల్లలు వున్నా వారి పనులలోపడి బాబ్ తో కలవడానికి వాళ్ళకి తీరిక లేదు. బాబ్ కావాలంటే తనే డ్రైవ్ చేసుకుని హాస్పిటల్‌కి వెళ్ళ గలడు. కాని తను తోడు కోసమే సొసైటీ సహాయం కోరాడు. దానితో నేను బాబ్‌ని కలవడం జరిగింది. మా ఇద్దరికి వయస్సునుంచి ఏ విధంగా చూసినా పొత్తు కుదరదు. కాని మా ఇద్దర్నీ బాధిస్తున్న ఒంటరితనాన్ని కల్సి ఇద్దరం జయించగలిగామని అనిపిస్తుంది.

బాబ్ రూముకు వచ్చి దాదాపు ఓ గంటైంది. బాబ్ తో కల్సివున్నప్పుడు ఇద్దరం పుస్తకాలు చదవటం, చర్చించడం జరుగుతూ వుండేది. అక్కడవున్న 'న్యూస్ వీక్' మ్యాగజైన్ తీసుకుని "మైటర్ని" వ్యాసాన్ని గట్టిగా చదవడం మొదలుపెట్టాను. నా గొంతు విన్న కొద్ది నిముషాలలోనే బాబ్ కళ్ళు తెరిచి నావైపు చూసాడు. ఆక్సిజన్ మాస్క్ ఆ నవ్వును దాచినా ఆ కళ్ళు దాచలేక పోయాయి. బాబ్ చేతిని అప్రయత్నంగా పట్టుకున్నాను. 'బాబ్' నాచేతిని ఒక్కసారి ఒత్తి కళ్ళు మూసుకున్నాడు. ముఖం నవ్వుతున్నట్లే వుంది.

ఎందుకో మళ్ళీ మధురాష్టకం వినాలనిపించింది. వల్లభాచార్యులు "గాడ్ ఈజ్ లవ్" అన్నట్లుగా దేవుడి ప్రతి అణువు, చర్య ప్రేమ మయం మధురం అని వ్రాయడం ఎంతటి గొప్ప ఆలోచనో అని అనుకున్నాను. కాని ఆక్షణంలో బాబ్‌లో వల్లభాచార్యుడు కనిపించాడు. జీవితాన్ని ప్రేమించడం అంత సులభం కాదు. ఇంటికి వెళ్ళడానికి కారు స్టార్ట్ చేసాను. రిపీట్ లో పెట్టాను కాబట్టి ఎమ్ఎస్ మధురాష్టకం పాడుతూనే వుంది.

'కరణం మధురం తరణం మధురం'

హరణం మధురం----

జీవితాన్ని పూర్తిగా అనుభవించి తృప్తిగా మరో లోకానికి కొత్త అనుభూతులకోసం బాబ్ విన్నూత ఉత్సాహంతో వెళ్ళిపోయాడనిపించింది.నేను పాడుతున్నది తప్పు అని తెలుసు. అప్రయత్నంగ నేను ఎమ్ఎస్ తో గొంతు కలిపి పాడసాగాను.

-----మరణం మధురం

మధురాధిపతే అఖిలం మధురం. ****